# భారీ మెజార్టీతో కేసీఆర్ గెలుపు ఖాయం

## చేపలు పట్టి మద్దతు తెలిపిన గజ్వేల్ ముదిరాజ్‌లు



పాండవుల చెరువులో చేపలు పట్టి బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్న ముదిరాజ్‌లు

గజ్వేల్‌అర్బన్, నవంబర్ 27: గత ఎన్నికల కన్నా రెట్టింపు మెజార్టీతో ఈసారి సీఎం కేసీఆర్ గెలుపు ఖాయమని గజ్వేల్ పట్టణ ముదిరాజ్‌లు అన్నారు. సోమవారం బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి, మండలాధ్యక్షుడు కొంటెమైన నర్సింలు బీఆర్ఎస్ ప్రచారంలో భాగంగా మత్స్యకారులను కేసీఆర్‌కు ఓటు వేయాలని కోరారు. కాగా మత్స్యకారులు కేసీఆరే గెలుస్తున్నాడని, చెరువులో వల వేస్తాం చేపలు పడితే ఖచ్చితంగా కేసీఆర్ గెలుస్తాడంటూ చెరువులో వల వేశారు. రెండు పెద్ద కొర్రమీను, 5 చిన్న పాంప్లెట్ చేపపిల్లలు పడ్డాయి. దీంతో ముదిరాజ్‌లు వాటిని చూపి రెట్టింపు మెజార్టీతో కేసీఆర్ గెలుస్తాడంటూ ముదిరాజ్‌లంతా జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి మాట్లాడుతూ ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేసిన సీఎం కేసీఆర్ ముదిరాజ్‌ల కులదైవమైన పెద్దమ్మతల్లి అనుగ్రహంతో భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రంలో 2వేలు ఉన్న మత్స్యకార సొసైటీలను 6వేలకు పెంచారన్నారు. ఈ సొసైటీల్లో 4లక్షల మంది మత్స్యకారులకు సభ్యత్వం ఇచ్చి చెరువులు, కుంటల్లో చేపలు పట్టడానికి అవకాశం కల్పించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు, రిజర్వాయర్లు, కుంటల్లో సంవత్సరానికి రూ.100కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.500 కోట్లు వెచ్చించి చేపపిల్లలు వేసి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కేసీఆర్ కృషి చేశారన్నారు. దీంతో వలస వెళ్లిన వారు తిరిగి గ్రామాలకు చేరుకుని ఆర్థికంగా బలోపేతం అవుతున్నారన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమాన్ని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని, కేసీఆర్ అందరినీ ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. అందుకే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. గజ్వేల్‌లోనూ రెండు ఎకరాల్లో రూ.5 కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మాణంతో పాటు గ్రామాల్లో కమ్యునిటీ హాళ్లు నిర్మించి, సీజీఎఫ్ నిధుల నుంచి పెద్దమ్మ ఆలయాలకు ఆర్థికంగా సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు కొంటెమైన నర్సింలు, నాయకులు రమేశ్, జీరరాజు, గజ్వేల్ మత్స్యకారులు నాగరాజు, ఎల్లం, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థుల మృత్యువాత

### మర్కూక్ మండల కేంద్రంలో విషాదఛాయలు



వినయ్(ఫైల్)



సంపత్(ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

మర్కూక్, నవంబర్ 27: కొండపోచమ్మ సాగర్ కాల్వలో ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. ఈ ఘటన మర్కూక్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మర్కూక్ గ్రామానికి చెందిన సంపత్(13), మైసిగారి వినయ్(11) రెండు రోజులు సెలవులు రావడంతో మరో ఇద్దరి స్నేహితులతో కలిసి సోమవారం ఉదయం వాకింగ్ వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కొండపోచమ్మ కాల్వ వద్ద ఈత కొట్టడానికి వినయ్, సంపత్, మరో స్నేహితుడు కాల్వలోకి దిగారు. కాల్వలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో సంపత్, వినయ్ ఇద్దరు నీట మునిగారు. భయంతో మరో ఇద్దరు పరిగెత్తుకుంటూ తల్లిదండ్రులకు చెప్పారు. వెంటనే కాల్వ వద్దకు వెళ్లి చూసేసరికి అప్పటికే ఇద్దరు నీట మునిగారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు కొంతమంది జాలార్లతో కలిసి కాల్వలో గాలింపు చేపట్టారు. వల సహాయంతో సంపత్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఎంత వెతికినా వినయ్ మృతదేహం లభించకపోవడంతో గజ ఈతగాళ్ల సాయంతో వినయ్ మృతదేహాన్ని బయటకు తీశారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## కొండపాక ఆనందనిలయంలో.. అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠ



ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠ పూజనిర్వహిస్తున్న శ్రీ పుష్పగిరి పీఠాధీశులు విద్యాశంకర భారతీస్వామి, చిత్రంలో ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 27 : సిద్దిపేట జిల్లా కొండపాక ఆనంద నిలయం ఆవరణలో నిర్మించిన అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శాస్త్రోక్త పద్ధతిలో ఉదయం 5 గంటల 11 నిమిషాలకు తులా లగ్నంలో పుష్పగిరి పీఠాధీశులు జగద్గురువులు విద్యాశంకర భారతీస్వామి యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ శిఖర ప్రతిష్ఠ, కళాన్యాసములు, షోడశ తత్వన్యాసములు, గోప్రథమ దర్శనం, పూర్ణాహుతి, కుంభాభిషేకం నిర్వహించారు. అష్టాదశ శక్తిపీఠ ప్రతిష్ఠలతో పాటు రామలింగేశ్వర స్వామి పార్వతీదేవి, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ మూర్తులను వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా పుష్పగిరి పీఠాధీశులు జగద్గురువులు విద్యాశంకర భారతీస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయం ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందుతుందని ట్రస్ట్ చైర్మన్ కె.వి.రమణాచారి, ఆనంద నిలయ ట్రస్ట్ చైర్మన్ లత రమణాచారి అన్నారు.

## సీఎం కేసీఆర్‌తోనే మాలలకు న్యాయం



ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి లేఖను అందజేస్తున్న రామచంద్రం, తదితరులు

గజ్వేల్, నవంబర్ 27: సీఎం కేసీఆర్‌తోనే మాలలకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం తమకు ఉందని, అందుకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో తమ మద్దతు కేసీఆర్‌కే అని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ రామచంద్రం అన్నారు. సోమవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. తర్వాత ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి కేసీఆర్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మాలలు కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో ఛీప్ కోఆర్డినేటర్ రావుల అంజన్న, తుమ్మ శ్రీనివాస్, బీంసేన్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరిన నేతలతో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌అర్బన్, నవంబర్27: ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో సోమవారం గజ్వేల్, ఆర్ అండ్‌ఆర్ కాలనీ, వర్గల్, కొండపాక మండలాల నుంచి భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్ నుంచి సీనియర్ నాయకులు నంధ్యానాయక్, ఉపసర్పంచ్ లలితానాగరాజు, మాజీ జడ్పీటీసీ లక్ష్మీరాములు, మాజీ సర్పంచ్ మల్లేశం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 80మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి వంటేరు ప్రతాప్‌రెడ్డి కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. వర్గల్ మండలం ఎంపీపీ లతారమేశ్, సర్పంచ్ లతాశివరాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు చెందిన వార్డు సభ్యురాలు అమృతాబాల్‌నర్సు, మరో 52మంది కాంగ్రెస్ నాయకులు, మహిళలు, అంబేద్కర్ సంఘం నాయకులు గాలెంక నర్సింలు ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంతో పాటు ఆర్ అండ్‌ఆర్ కాలనీకి చెందిన యువకులు దాదాపు 400ల మందికి పైగా యువకులు కారెక్కారు.

## ప్రతిపక్షాలకు ఓటుతో బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవీ రవీందర్

గజ్వేల్, నవంబర్ 27: రైతులకు పెట్టుబడి సాయాన్ని వేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండగా రైతుబంధు ఆపిన ప్రతిపక్షాలకు ఓటుతో రైతులు బుద్ధి చెప్పాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతుల ఖాతాలో రైతుబంధు డబ్బులు పడితే రైతులు సీఎం కేసీఆర్ వైపే మొగ్గు చూపిస్తారనే భ్రమతో జీర్ణించుకోలేని కాంగ్రెస్, బీజేపీలు రైతుబంధు సాయాన్ని ఆపేలా కుట్ర చేశాయని ఆరోపించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కృష్ణాగౌడ్, ఎంపీటీసీ అంజనేయులు కౌన్సిలర్లు, శ్రీనివాస్, చందు, పంబాల శివ, సర్పంచ్‌లు రమేశ్, దశరథం, మహేందర్, రాజయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గులాబీ దళం.. హుషారుగా ప్రచారం

ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మర్కూక్: నర్సన్నపేటలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



వర్గల్ : మజీద్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు



గజ్వేల్అర్బన్: 9వ వార్డులో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ శిరీషారాజు



గజ్వేల్ : సింగాటంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు